నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | సెప్టెంబర్ 29, 2024 | www.navatelangana.com
1

ఆశ్రమ పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుంటాల గ్రామ ఆశ్రమ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ పెన్సింగ్‌ను శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. అనంతరం అదనపు గదుల వద్ద నూతనంగా స్టేజ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తూ పాఠశాలలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి చేరుకొని కుంటాల గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కేసీఆర్ హయాంలో జిల్లాకొక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి పేదింటి బిడ్డలు కూడా డాక్టర్లు అయ్యే అవకాశాన్ని కల్పించారని తెలిపారు.



అవార్డుల నామినేషన్లకు గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ నామినేషన్ల దరఖాస్తుకు అక్టోబర్ 15 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఇన్‌స్పైర్ నామినేషన్ల నమోదు ప్రక్రియ చాలా మందకొడిగా కొనసాగుతుందని, ఇప్పటివరకు 433 పాఠశాలలు దరఖాస్తు చేయాల్సి ఉండగా కేవలం 107 పాఠశాలల నుంచి 440 నామినేషన్లు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ తగు చర్యలు తీసుకొని నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అక్టోబర్ 2 నుంచి దసరా సెలవులు ఉన్నందున అక్టోబర్ 1లోపల నామినేషన్ల ప్రక్రియను ముగించాలని సూచించారు.

భగత్‌సింగ్ నేటి తరానికి స్ఫూర్తిదాయకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. శనివారం భగత్ సింగ్ జయంతి వేడుకలను బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్రం కోసం భగత్ సింగ్ చేసిన పోరాటాలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు లాలా మున్న, రఘుపతి, జోగు రవి, ఆకుల ప్రవీణ్, సోమ రవి, అర్జున్, అఖిల్, భారత్, ముకుంద్ పాల్గొన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ప్రజల ఐక్యతను చీల్చి మతోన్మాద రాజకీయాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు యుగంధర్, శ్రీను, సూర్య, శేఖర్, రాజేష్, ప్రవీణ్ పాల్గొన్నారు. యూఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అల్తాఫ్ ఆధ్వర్యంలో జరిగిన భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. కలెక్టర్ బంగ్లా సమీపంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భగత్ సింగ్‌విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అక్షయ్, నిఖిల్, కార్తీక్, మహేష్ పాల్గొన్నారు.

రేబీస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-దండేపల్లి

ప్రపంచ రేబీస్ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రేబీస్ వ్యాధిపై శనివారం మండల పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ అవగాహన కల్పించారు. రేబీస్ వ్యాధితో కలిగే నష్టాలు, నివారణ గురించి వివరించారు. కుక్క కరిచిన వెంటనే యాంటీరేబీస్ టీకా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, పాఠశాల, పశువైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మనస్తాపానికి గురి చేసిన శంకర్ మరణం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త గోలి శంకర్ మృతి కార్యకర్తలను తీవ్ర మనస్థాపానికి గురి చేసిందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని మహాలక్ష్మివాడలో ఏర్పాటు చేసిన పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని గోలి శంకర్‌ను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. శంకర్‌తో ఉన్న స్నేహపూర్వ సంబంధాన్ని స్థానికులతో పంచుకున్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోకండ్ల రమేష్, ఇజ్జగిరి నారాయణ, రంగినేని శ్రీనివాస్, పందిరి భూమన్న, దమ్మపాల్, కొండ గణేష్, చిన్నసాయి, బుచ్చక్క పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన వ్యవసాయాధికారులకు సన్మానం

నవతెలంగాణ-హాజీపూర్

ఇటీవల బదిలీపై వెళ్లిన వ్యవసాయ శాఖ అధికారులకు మండల వ్యవసాయ శాఖ, ఫెర్టిలైజర్ డీలర్లు ఘనంగా సన్మానించారు. వ్యవసాయ అధికారి రజిత, వ్యవసాయ విస్తరణ అధికారులు కనకరాజు, శ్రీనికను గుడిపేట్ రైతు వేదికలో శనివారం సన్మానించారు. మండల రైతాంగానికి వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సురేఖ, ఏవోలు కృష్ణ, ప్రభాకర్, అంజిత్, ఫెర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులు బాగా చదువుకోవాలని ఉమాపతి కుంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ రవీందర్ అన్నారు. శనివారం విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను ప్రతిరోజూ పాఠశాలకు సక్రమంగా పంపాలని కోరారు. చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గెడం సీతారాం, గ్రామ పటేల్ చిన్ను, లాల్‌శవు, జంగు, జైతు పాల్గొన్నారు.

ఏఐఎస్బీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా సన్నీగౌడ్

నస్పూర్: ఏఐఎస్బీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా కనుకుంట్ల సన్నీగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఏఐఎస్బీ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా కార్యదర్శి కనుకుంట్ల సన్నీగౌడ్ జిల్లా రిపోర్టు ప్రవేశపెట్టారు. మంచిర్యాల జిల్లాలోని వసతిగృహాలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో అనేక సమస్యలు ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పరిహారం ఎప్పుడు..?

- వరదలతో నష్టపోయిన పత్తి, ఇతర పంటలు
- క్షేత్రస్థాయి సర్వే పూర్తిచేసిన వ్యవసాయ అధికారులు
- ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాల్లో మునిగిన పంటలు
- రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోవడంతో రూ.కోట్లలో నష్టం
- ప్రభుత్వ సాయంపై అన్నదాతలు, ప్రజల ఎదురుచూపులు

ఉమ్మడి జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పచ్చని పంటలు అతలాకుతలమయ్యాయి. నదులు, వాగుల నుంచి వరద పోటెత్తడంతో సమీప పంట చేలన్ని నీటిలో మునిగిపోయాయి. చేతికొచ్చే సమయంలో పంటలు నీటిపాలు కావడంతో అన్నదాతల బాధలు వర్ణనాతీతంగా మారాయి. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఈ క్రమంలో వరద ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి నివేదిక అందించాలని వ్యవసాయశాఖకు ఆదేశాలు జారీ చేసింది. వారం రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు రైతుల వారీగా పంటలకు జరిగిన నష్టం వివరాలను తెలుసుకున్నారు. నివేదికను ప్రభుత్వానికి అందించారు. మరోపక్క జిల్లాలో పలు చోట్ల రోడ్లు, కల్వర్టులు, వంతెనలు కొట్టుకుపోవడంతో రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నుంచి పరిహారం విషయమై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రావడం లేదు. ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం నుంచి పరిహారం విషయమై స్పష్టత రాకపోవడంతో అన్నదాతలతో పాటు ప్రజల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది.



నష్టం వివరాలు సేకరిస్తున్న అధికారులు(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు జిల్లాను అతలాకుతలం చేశాయి. మరోపక్క నదులు, వాగుల పక్కన ఉన్న పంట పొలాలు వరద తాకిడికి గురికాగా.. పలు చోట్ల ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌కు చెందిన రోడ్లు, కల్వర్టులు, లోలెవల్ వంతెనలు కొట్టుకుపోయాయి. దీంతో ఎక్కువగా ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాలోనే అధికంగా నష్టం జరిగింది. ఆదిలాబాద్ జిల్లాలో 8మండలాల్లో వరద ప్రభావం చూపించగా.. 109 గ్రామాల్లో 2041మంది రైతులకు సంబంధించిన 3096 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో ప్రధానంగా పత్తి పంట 2473 ఎకరాల్లో ఉండగా సోయా 368 ఎకరాలు, వరి 17ఎకరాలు, కందులు 171ఎకరాలు, మొక్కజొన్న 60 ఎకరాలు, మిర్చి 4 ఎకరాలు, జొన్న మరో 3 ఎకరాల్లో నష్టపోయినట్లు అధికారులు తేల్చారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 59 గ్రామాలకు గాను 1371మంది రైతులకు సంబంధించిన పంటల్లో పత్తి 2528ఎకరాలు, వరి 18 ఎకరాలు, మిరప 152 ఎకరాల్లో నష్టం జరిగినట్లు గుర్తించారు. మరోపక్క ఆదిలాబాద్ జిల్లాలో ఆర్అండ్‌బీ పరిధిలో 116 రోడ్లు దెబ్బతినగా.. 26కల్వర్టులు, 13 రోడ్లు కోతకు గురైనట్లు అధికారులు తేల్చారు. వీటిని శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలంటే రూ.120.78కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. పంచాయతీరాజ్ పరిధిలో 240రోడ్లు, కల్వర్టులు చెడిపోయా.. వీటిని శాశ్వత ప్రతిపాదికన పనులు చేపట్టి బాగు చేయాలంటే రూ.344కోట్లు అవసరమవుతాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

పరిహారంపై గంపెడాశలు..!

పంట చేతికొచ్చే సమయంలో వరద నీటి పాలు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. వరదల సమయంలో ప్రభుత్వం సైతం పంట నష్టం జరిగితే పరిహారం చెల్లిస్తామని రైతులెవరూ అధైర్యపడకూడదని భరోసా ఇచ్చింది. ఖమ్మంలో పర్యటించిన ముఖ్యమంత్రి, మంత్రులు ఎకరానికి రూ.10వేల చొప్పున పంట నష్టం పరిహారం చెల్లిస్తామని హామీనిచ్చారు. పంట నష్టం జరిగి సుమారు నెల రోజులు కావస్తోంది. కానీ ప్రభుత్వం నుంచి పరిహారం విషయమై ఎలాంటి ప్రకటన వెలువడటం లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం ఎప్పుడొస్తుందో..అని ఆతృతగా ఎదురుచూస్తున్నారు. మరోపక్క అనేక చోట్ల రోడ్లు, కల్వర్టులు తెగిపోవడంతో తాత్కాలిక పనులు చేపట్టేందుకు సైతం నిధులు విడుదల కాలేదు. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించడం కష్టంగా మారుతోందని పలువురు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ కొన్ని చోట్ల దారులు బాగుచేసిన సందర్భాలు లేకపోవడంతో ప్రయాణాలు చేయడం నిత్యనరకంగా భావిస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం : శ్రీధర్‌స్వామి, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి

జిల్లాలో పంట నష్ట పరిహారం విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపాం. పంట నష్టం వివరాలన్నీ సేకరించి పంపించామని, ప్రభుత్వం నుండి పరిహారం మంజూరు కాగానే నష్టపోయిన రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

పిప్పిరి కుండిషేకుగూడ వరకు రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు



నవతెలంగాణ-నార్నూర్

పిప్పిరి కుండిషేకుగూడ వరకు రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గాదిగూడ మండలంలోని కుండిషేకుగూడ గ్రామ పార్టీ శాఖ మహాసభలో భీంరావు మాట్లాడారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుండిషేకుగూడకు తాగు నీరు, రోడ్డు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో గతేడాది పిల్లా పాపలతో 70కి.మీటర్ల పాదయాత్ర చేసి తొమ్మిది రోజులు కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేయడంతో ప్రభుత్వం తాగు నీరు, త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించిందని గుర్తు చేశారు. రోడ్డు ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదించారని తెలిపారు. ఆరు నెలల క్రితం పిప్పిరి నుండి కుండిషేకుగూడ వరకు రోడ్డు మంజూరు చేస్తూ నిధులు కేటాయించినా ఇప్పటి వరకు పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం భావ్యం కాదన్నారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలన్నారు. అలాగే గ్రామంలో లింక్ రోడ్లు, మురుగు కాలువలు, పక్కా ఇండ్లు, ఇతర మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో గ్రామ సమస్యల పరిష్కారానికి పోరాడుతామని పలు తీర్మానాలు చేశారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా కొముర౦ భీంరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు ముకినేపల్లి గంగన్న, రేసు సురేందర్ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జీవో నెంబర్ 25 ద్వారా ఉపాధ్యాయులను సర్దుబాటుకు చేయటాన్ని విరమించుకోవాలని ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బెజ్జంకి రవీంద్ర, జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తిర్పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 25 ప్రకారం పాఠశాలలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయటాన్ని నిరసిస్తూ జాక్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేసినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు సంవత్సరాల తరబడి కోరుతుంటే ప్రభుత్వం అశాస్త్రీయమైన రేషనలైజేషన్ ఉత్తర్వులను అమలు చేయాలని ఉత్తర్వులివ్వడం అసంబద్ధమని ఖండించారు. 60మంది విద్యార్థుల వరకు ఇద్దరే ఉపాధ్యాయులు బోధించాలని పేర్కొనడం అశాస్త్రీయమని, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంతో సంబంధం లేకుండా ప్రతి 20 మంది విద్యార్థులకు కనీసం ఇద్దరూ ఉపాధ్యాయులు, తర్వాత ప్రతి 20కి ఒకరి చొప్పున ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. అన్ని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుడి పోస్ట్ మంజూరు చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బదిలీ అయి రిలీవ్ కాని టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని, రిలీవ్ చేసిన అనంతరమే సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ రాష్ట్ర నాయకులు పుప్పాల నరేందర్, పాఠశాల ప్రధానోపధ్యాయులు పిల్లి కిషన్, అర్బన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.చంద్రశేఖర్, బి.పొచ్చారెడ్డి, ఎస్టీయు నాయకులు ఆర్.రవీందర్ పాల్గొన్నారు.

పకడ్బందీ ప్రణాళికతో ఏ లక్ష్యమైనా సాధ్యమే

- నిజామాబాద్ ట్రైనీ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పకడ్బందీ ప్రణాళిక, నిరంతర ప్రయత్నంతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని, లక్ష్యాలను నిర్దేశించుకుంటు దానికి అనుగుణంగా శ్రమిస్తే విజయాలు సాధించవచ్చని ఐఏఎస్ 35వ ర్యాంకర్, నిజామాబాద్ ట్రైనీ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేరీర్ గైడెన్స్, అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సివిల్స్, గ్రూప్స్‌లో ఏ విధంగా విజయాలు సాధించవచ్చో విద్యార్థులకు తెలియజేశారు. ముందుగా ఆయనను కళాశాల బృందం పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించారు. ప్రిపరేషన్‌లో ఎదురయ్యే విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సంకేత్ కుమార్ మాట్లాడుతూ ఏ ఉద్యోగమైన లక్ష్యంతో సాధించవచ్చని తెలిపారు. ముందుగా తాము ఎందుకు చేయాలనుకుంటామో నిర్ధారించుకొని ముందుకు సాగాలన్నారు. తాను కూడా సివిల్స్‌కు సిద్ధమయ్యే ముందు ఎందుకు అవ్వాలో సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు చెప్పారు. శ్రమించి నేడు ఈ స్థానంలో ఉన్నానని తెలిపారు. ఏ రంగంలోనైన రాణించాలంటే వాటి గురించి తెలుసుకుంటు వచ్చిన తరువాత ఏం చేయాలో గుర్తించాలన్నారు. అప్పుడే శ్రమకు తగ్గిన ఫలితం వస్తుందన్నారు. ఆత్మ విశ్వాసం కలిగి సోషల్ మీడియాను తాత్కాలికంగా త్యాగం చేసి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు కూడా అద్భుతాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. ప్రిపరేషన్ మెళకువలు, సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీ పరీక్షలో 35వ ర్యాంకుతో ఐఏఎస్ సాధించి తెలంగాణ క్యాడర్‌కు ఎంపిక కావడం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే గర్వ కారణమన్నారు. కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు ప్రేరణ పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగ్రామ్, అధ్యాపకులు అరుణ్‌కుమార్, సంతోష్‌కుమార్, చక్రవర్తి, రవికిరణ్, అష్రఫ్ అలీ, శ్రీధర, శ్రావణి, మంజుల, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, సలేహా, విద్యార్థులు పాల్గొన్నారు.





తిరుమల ఆసుపత్రిని సీజ్ చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న తిరుమల ప్రయివేట్ ఆస్పత్రిని వెంటనే సీజ్ చేయాలని సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ శివరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ మాట్లాడుతూ తిరుమల ఆస్పత్రి యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ధనార్జనే ధ్యేయంగా అమాయక పేద ప్రజల దగ్గర నుండి అధిక డబ్బులు వసూలు చేస్తోందన్నారు. శుక్రవారం నాటి ఘటనతో ఆస్పత్రికి ప్రభుత్వ అనుమతులు లేవని స్పష్టమైందన్నారు. ఎంబిబిఎస్ పూర్తి కాకుండానే డాక్టర్ సౌజన్య ప్రజలకు ఎలా వైద్యం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు దుర్గం లింగన్న, ఐఎఫ్‌టియు డివిజన్ నాయకులు మద్దినేని చిన్నరాజన్న పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలి



నవతెలంగాణ-నస్పూర్

భగత్ సింగ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. శనివారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాల, హాజీపూర్ మౌంట్ కార్మల్ హైస్కూల్‌లో భగత్ సింగ్ 117వ జయంతిని పురస్కరించుకొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భగత్ సింగ్ అతి చిన్న వయసులో దేశ స్వాతంత్రం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప మహనీయుడని, అలాంటి మహనీయుని యొక్క జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో అందరికీ విద్యా ఉపాధి కలగాలని లక్ష్యంతో పోరాడుతామని తెలిపారు. బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో దేశ సమగ్రతను దెబ్బతీసే కుట్ర చేస్తోందని, దాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత ఉందని అన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

నవ తెలంగాణ-తాంసి



భీంపూర్ మండల నూతన తహసీల్దారుగా నలందప్రియ బాధ్యతలు స్వీకరించారు. శనివారం కార్యాలయ సిబ్బందితో పాటు మండల బీఆర్ఎస్ నాయకులు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు కలిసి తహసీల్దార్‌ను పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలు ఏవైనా ఉండి తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాగయ్య, ఉత్తం రాథోడ్, ధరమ్ సింగ్, రాహుఫ్, దినేష్, రామేశ్వర్ ఉన్నారు.

హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఎన్నికల ముందు రైతులు, ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, బండిదత్తాత్రి అన్నారు. శనివారం రూరల్ మండలంలోని చాందా(టి) గ్రామంలో గ్రామ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు బంధు రైతుల ఖాతాలో వేయాలని, అర్హులైన పేదలకు ఇండ్లు కట్టి ఇవ్వాలన్నారు. రుణమాఫీ కానీ రైతులందరికి రుణమాఫీ చేయాలనీ, రైతు భరోసా అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ, మండల కార్యదర్శి స్వామి, గంగన్న పాల్గొన్నారు.

అటవీ అధికారులపై దాడులు అరికట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అటవీ రక్షణలో రాత్రి పగలు విధులు నిర్వహించి అటవీ సంపదను కాపడుతున్న అధికారులపై తెలంగాణలో దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని, వీటి నివారణకు ప్రభుత్వం అటవీ అధికారులకు ఆయుధాలు ఇవ్వాలని ఎస్ఆర్ఓ గులాబ్ సింగ్ కోరారు. వరంగల్‌లోని ములుగు తాడ్వాయి రేంజ్ పరిధిలో ఇద్దరు అటవీ అధికారులు, సిబ్బందిపై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ గులాబ్ సింగ్ మాట్లాడుతూ అటవీ రక్షణకు కృషి చేస్తున్న అధికారులపై నిత్యం దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఈ దాడులను నివారించాలన్నారు. స్మగర్ల చేతిలో మరణాలు జరుగుతున్న పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆత్మరక్షణ కోసం అటవీ అధికారులకు కూడా ఆయుధాలను ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటు తమకు రక్షణ కల్పించాలని కోరారు. దాడులకు పాల్పడుతున్న దుర్మార్గులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అటవీ అధికారులు నరేష్, కృష్ణ, సాయి, ప్రవీణ్, అమర్ సింగ్ పాల్గొన్నారు.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

- వివరాలు వెల్లడించిన భైంసా రూరల్ సీఐ నైలు



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని ఓ గ్రామంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. శనివారం భైంసా రూరల్ సీఐ నైలు వివరాలు వెల్లడించారు. ఈనెల 26న ఓ గ్రామానికి చెందిన వివాహితపై అదే గ్రామానికి చెందిన సాయబ్ రావు కొన్ని రోజుల నుంచి ఆ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. గ్రామస్తులు అతనికి మందలించారు. కోపంలో ఈనెల 26న ఆ మహిళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటరిగా ఉన్న వివాహితపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో కేసు నమోదు చేసుకున్న పోలీసులు రెండు రోజుల నుంచి కుభీర్ ఎస్ఐ రవీందర్, భైంసా రూరల్ సిఐ సిబ్బంది రెండు బృందాలుగా విడిపోయి నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు.

ఓటర్ జాబితాపై బీఎల్ఓలకు అవగాహన



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ కొట్నాక్ రఘునాథ్ రావ్ ఓటర్ జాబితాపై బీఎల్ఓలకు అవగాహన కల్పించారు. రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టికొని ఓటర్ జాబితాలో మార్పులు, సవరణను పకడ్బందీగా నిర్వహించడానికి బీఎల్ఓలతో ఈ సమావేశం ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. గ్రామాల్లో ఓటర్ జాబితాలో ఉన్న కుటుంబ సభ్యులను ఒకే చోట చేర్పించాలని సూచించారు. దీనికి సంబందించిన ఓటర్ తుది జాబితా లిస్టని సంబంధిత బీఎల్ఓలకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావ్, కార్యాలయ సిబ్బంది, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నార్నూర్

స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా ఆదివాసీ గ్రామాల్లో కనీసం రోడ్డు సౌకర్యం లేదనీ ప్రభుత్వం ఆదివాసుల సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ గాదిగూడ మండల ప్రధాన కార్యదర్శి కుమ్ర శంకర్ కోరారు. శనివారం గాదిగూడ మండలంలోని కొలామా గ్రామాన్ని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు, ప్రభుత్వాలు మారుతున్న ఆదివాసీ గ్రామాలకు ఇప్పటికి రోడ్డు సౌకర్యం కల్పించలేదన్నారు. ఆదివాసీ మహిళలు, గర్భిణులు పురిటి నొప్పులు వస్తే ఆస్పత్రికి తీసుకెళ్లాన్న సరైన మార్గం లేదన్నారు. ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు కూడా ఉన్నాయని గ్రామ పటేల్ జగ్నుక్ సంతోష్ తెలిపారు. ఇప్పటికైనా అధికారంలో ఉన్న ప్రభుత్వం గమనించి గాదిగూడ మండలంలోని ప్రతి ఆదివాసీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఆయన వెంట నగేష్, యశ్వంత్, దయానంద్, ఆనంద్ రావ్, నాగ్‌నాథ్, గజానంద్, బాపూరావ్, దేవరావ్, శివాజీ, ప్రహ్లాద్, హన్మంత్ రావ్, ఉన్నారు.

ధృవపత్రాల పరిశీలనకు మరో అవకాశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టీజీ డీసెట్-2024లో అర్హత ర్యాంక్ సాధించి గత ఆగస్టు నెలలో సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరుకాని అభ్యర్థులకు మరొకసారి అవకాశం కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏ రవీందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో అక్టోబర్ 1న ఉదయం10 నుండి సాయంత్రం 5 గంటల వరకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో (గతంలో వెరిఫికేషన్‌కు హాజరు కానీ అభ్యర్థులు) హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ- స్కూల్ ఎడ్యుకేషన్ ప్రవేశానికి సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు చివరి అవకాశం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. కావున ఉమ్మడి జిల్లాల్లోని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం

- సమస్య ఉంటే టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలి
- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరేళ్ల శారద



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో నాలుగు రోజుల పర్యటనలో అనేక సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కరం కోసం సంబంధిత అధికారులకు సూచనలు చేయడం జరిగిందని రాష్ట్ర మహిళ కమిషన్ ఛైర్‌పర్సన్ నేరేళ్ల శారద అన్నారు. పొలంలో పనిచేసే మహిళ నుండి ఐటీ కంపెనీలో పని చేసే వారి వరకు ప్రతి ఒక్క మహిళను సంరక్షించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పెన్ గంగా భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించి పర్యటన వివరాలను తెలియజేశారు. నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా పర్యటించి పలు సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. మహిళల భద్రత, వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని, తన దృష్టికి వచ్చిన అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పర్యటనలో భాగంగా జిల్లా జైలును సందర్శించి మహిళా ఖైదీల స్థితిగతులు తెలుసుకున్నట్లు తెలిపారు. అక్కడ వారికి కల్పిస్తున్న వసతులు సంతృప్తికరంగా ఉన్నాయని అన్నారు. అలాగే పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేయగా కొన్ని సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా మహిళల విషయానికొస్తే పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని, అందుకుగాను ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆశ్రమ పాఠశాలలు తనిఖీ చేసి మహిళ కమిషన్‌ను ఎలా సంప్రదించాలో తెలియజేశామన్నారు. వివిధ దశల్లో మార్పు చెందే మహిళాలకు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. వాటిపై అవగాహన కల్పించేలా పోషణ్ మా ద్వారా అంగన్‌వాడీలు అందించే సేవలను తెలియజేశామని అన్నారు. మహిళలను పురుషులు గౌరవించాలని పేర్కొన్నారు. సొసైటీలో మహిళలను చూసే దృక్పథం మారనంత వరకు ఈ సమాజం మారదన్నారు. ఏదైనా ఒక సంఘటన జరిగినప్పుడు మనం ఒకరిని నిందిస్తామని మనం అలా నిందించే ముందు మనం మహిళల రక్షణకోసం ఎంత వరకు న్యాయం చేస్తున్నామో ఆత్మరక్షణ చేసుకోవాలని హితవు పలికారు. అలాగే పని చేసేచోట ఏమైన ఇబ్బందులు తలెత్తితే మహిళా కమిషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయచ్చని సూచించారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. దీనిపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



నవతెలంగాణ-నిర్మల్

వరల్డ్ విజన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాఘవేంద్ర పబ్లికేషన్స్ పదవ తరగతి స్టడీ మెటీరియల్‌ను కలెక్టర్ అభిలాష అభినవ్ విద్యార్థులకు అందజేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో డీఈఓ రవీందర్ రెడ్డితో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరల్డ్ విజన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అందజేసిన స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు బోర్డు పరీక్షలకు సిద్ధం కావడానికి ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. లక్ష్మణచందా మండలంలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 364 మంది పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాలు ఏరియా డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా అందించినట్లు తెలిపారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసిన వరల్డ్ విజన్ ఇండియా సంస్థ ప్రతినిధులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ ప్రోగ్రాం అధికారి వై.బ్రహ్మన్న, ప్రతినిధులు అంబేద్కర్, హంగమన్న, ఎస్ఆర్ పబ్లికేషన్స్ ప్రతినిధి సాయినాథ్, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలి : పిడమర్తి రవి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డా.పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మాదిగల మేలుకొలుపు యాత్ర శనివారం ఆదిలాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్ళర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఉమ్మడి 10 జిల్లాలలో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం వారి జనాభా ఎంత ఉంటే అంత రిజర్వేషన్ కల్పించాలని కొన్ని జిల్లాలలో మాదిగలు అధికంగా ఉన్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేయడం హర్షనీయమన్నారు. ఈ కమిటీ మాదిగ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. 30 సంవత్సరాల క్రితం పెట్టిన ఏడు శాతం డిమాండు ఇప్పుడు అమలు చేస్తే మాదిగలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పెరిగిన జనాభాకు అనుగుణంగా వర్గీకరణ చేయాలన్నారు. జిల్లాల వారీగా వర్గీకరణ చేపట్టే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని జిల్లాల కేంద్రంలో మాదిగల మేలుకొలుపు యాత్ర ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని పెద్ద కులాలకు రాష్ట్ర ప్రభుత్వంలో ప్రాతినిధ్యం తక్కువగా ఉందని మాదిగలు, లంబాడీలు, మాలలకు, ముదిరాజులకు మంత్రి పదవీ ఇవ్వాలన్నారు. మాదిగ ఐక్య కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల మేలుకొలుపు యాత్ర అక్టోబర్ 1న బోనగిరిలో ముగింపు సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మనోజ్, నక్క రాందాస్, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఒక్కల గడ్డ సోమచంద్రశేఖర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, మాదిగ జేఏసీ ఓయూ అధ్యక్షులు జోగు గణేష్, పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా నీటిని అందించేలా చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెరిగిన జనాభాకు అనుగుణంగా మున్సిపల్ పరిధిలో నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. అమృత్ పథకంలో భాగంగా పది లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం శనివారం వాల్మీకినగర్‌లో భూమి పూజ చేశారు. ట్యాంక్ నిర్మాణం గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ గ్రేడ్ వన్ మున్సిపాటిలిగా మారిన ఆదిలాబాద్‌లో మంచి నీటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకారం అందిస్తుందని తెలిపారు. అమృత్ పథకంలో వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించుకుంటు ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మురుగు నీరు చెరువులో కలిసి చెరువులు కూడా కలుషితం అవుతున్నాయని, మురుగు నీటిని శుద్ధి చేసి చెరువులో వదిలేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఆదిలాబాద్‌కు ప్రత్యేక స్థానం కల్పించేల అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. అధికారులు కూడా కేంద్ర ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఏఈ అరుణ్ కుమార్, బీజేపీ నాయకులు లాలామున్న, ఆకుల ప్రవీణ్, సోమ రవి, మీషు, భీంసెన్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరుబాట పట్టాలి

- పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభ
- హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందం




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు పోరుబాట పట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవన్‌లో జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ ఆధ్వర్యంలో పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పీడీఎస్‌యూ శాస్త్రీయ విద్యా విదానానికి పోరాడుతుందని అన్నారు. విద్యార్థులంతా కుల మతాల బేధాలు లేకుండా అందరూ సమసమాజ స్థాపనకు ఉద్యమించాలన్నారు. విద్యార్థి అమర వీరుల ఆశయాలను సాదిద్దామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని విస్మరిస్తున్నాయని, విద్యార్థులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. కుల, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అత్రం భుజంగ్ రావు, పీడీఎస్‌యూ నాయకులు వినోద్, అశోక్, పూర్వ జిల్లా నాయకులు విజ్జగిరి నారాయణ, మనోజ్, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి జగన్ సింగ్, జిల్లా కార్యదర్శి లక్ష్మి, రాణి, విజేత, జిల్లా కార్యదర్శి వినోద్, విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ రాహుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు ఆరోగ్య అలవాట్లు మార్చాలి

- డీఎంహెచ్ఓ కృష్ణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు జీవన విధానం, ఆరోగ్య అలవాట్లలో మార్పులు చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ సూచించారు. శనివారం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎంహెస్ఓ కార్యాలయంలో సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. స్వయంగా ఆయన కూడా ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ రోజు వారిగా తీసుకునే పోషకాలు తగ్గిపోవడంతోనే దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షఉగర్ లాంటివి త్వరగా వస్తాయని పేర్కొన్నారు. వాటిని నిరోధించడానికి ప్రతి ఒక్కరు వారి జీవన విధానంతో పాటు ఆరోగ్య అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం ఈనెల 29న ఉందని ఆ రోజు ఆదివారం సెలవు కావడంతో శనివారం సిబ్బందికి హెల్త్ చెకప్ చేయడం జరిగిందని తెలిపారు. రోజు తీసుకునే ఆహారాన్ని సమతూల్యంగా తీసుకోవాలని, నిత్యం వ్యాయమం చేయాలన్నారు. అప్పుడే ఎలాంటి వ్యాధులు దరిచేరవని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, డాక్టర్ గజానంద్, డీఎంఓ డాక్టర్ శ్రీధర్, వైద్య ఆరోగ్య శాఖసిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐటీఐ కళాశాలలో అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేల కలెక్టర్ హామీ ఇచ్చారని, తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవడం జరిగిందని కళాశాల ఐఎంసీ చైర్మెన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం కళాశాలలో ఐఎంసీ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం పలు విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా బీజీఆర్ మాట్లాడుతూ అధ్యాపకులు లేక బోధన సాగడం లేదని ఇటీవల విద్యార్థులు కలెక్టర్‌కు విన్నవించారని, స్పందించిన ఆయన అధ్యాపకుల సమస్యలను పది రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్ని తెలిపారు. వేతనాలు కూడా అందిస్తామని పేర్కొన్నారు. నైపుణ్యాలుంటే ఏదైన సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందరికి ఉద్యోగాలు ఇవ్వలేదని, అందుకే స్వయం ఉపాధి కోసం రుణాలను కూడా అందిస్తుందన్నారు. వృత్తి నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుంటు జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐఎంసీ కమిటీ సభ్యులు పద్మభూషన్ రాజు, తిరుమల్ రెడ్డి, మహేష్, సినియర్ సభ్యులు అంజద్ ఖాన్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సోనాల గ్రామానికి చెందిన ఎండే రమణ కూతురు సహస్ర, కాంబ్లే రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాధవ్ శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సదానందం, నాయకులు తిరుమల గౌడ్, సుధీర్ రెడ్డి, రుక్మాణ్‌సింగ్, డాక్టర్ స్వామి, అల్లకొండా ప్రశాంత్, ఈశ్వర్, ప్రకాష్ ఉన్నారు.

ఆదివాసుల జీవనోపాధికి ఏకలవ్య ఫౌండేషన్ చేయూత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసుల జీవనోపాధికి ఏకలవ్య ఫౌండేషన్ చేయూతనిస్తోందని ఆ సంస్థ ఛైర్మన్ వెంకట్ రావ్ అన్నారు. శనివారం సీఈఓ మధుకర్‌తో కలిసి వాల్గొండ గ్రామంలో జరిగిన వాటార్ షెడ్ పనులను పరిశీలించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఆదివాసుల అభ్యున్నతికి సంస్థ18సంవత్సరాల నుండి అనేక కార్యక్రమాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పచ్, జూగాది రావ్, లచ్చు పటేల్, సంస్థ ట్రస్ట్ సభ్యులు దిగంబర్, ముత్యం శంకర్, దిగంబర్ పాల్గొన్నారు.



రక్షణ పద్ధతుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



వరదలలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యల పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దాశుక్లా సూచించారు. శనివారం కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామ సమీపంలోని ప్రాజెక్టు వద్ద ఎన్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులచే గ్రామ యువతకు శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో వరదలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని, ఇందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. తోటి వారి ప్రాణాలను కాపాడడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీఓ రమేష్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేందర్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-కౌటాల



నిబంధనలు ఇస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మధూకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని దశలిపట్టు పరిశ్రమ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురి వాహనాలను తనిఖీ చేసి నిబంధనలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు అన్ని ధృవ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. లేనివారికి జరిమాన విధిస్తూ మరోసారి పట్టుబడితే సీజ్ చేస్తామన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇస్తే ఇచ్చిన వారితో పాటు తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

లోక్‌అదాలత్‌లో రాజీమార్గాన కేసుల పరిష్కారం

- జిల్లా జడ్జి ఎంపీ రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా జడ్జీ ఎంపీ రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని న్యాయస్థానం భవన సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.యువరాజ, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జీ జె.అనంతలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సివిల్, క్రిమినల్ కేసులతో పాటు ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో సివిల్ కేసులు, క్రిమినల్ కేసులతో పాటు, ఎక్సైజ్, సీసీ, ఎస్టీసీ, సైబర్ క్రైమ్‌లతో కలిపి 4867 కేసులను పరిష్కారం చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో మూడు బెంచ్‌లతో పాటు సిర్పూర్‌లో ఒక బెంచ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్, లోక్ అదాలత్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

భారీగా 4867 కేసుల రాజీ

గతంలో నిర్వహించిన లోక్ అదాలత్ లతో పోలిస్తే శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ లో భారీగా 4867 కేసులు పరిష్కారం అయినట్లు అధికారులు తెలుపగా ఇది రికార్డుగా మారింది. పరిష్కారమైన కేసులకు సంబంధించి రూ.43,06,610 అపరాధ రుసుము రూపంలో వసూలు చేసినట్లు తెలిపారు.

కస్తూర్బాలో స్వచ్ఛతా హి సేవా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శనివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులు స్వచ్ఛతా హి సేవా ఆకారంలో నిర్వహించిన మానవహారం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రణీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎస్పీఎం సీఎస్ఆర్ మేనేజర్ రీనా బిల్వాల్, ప్రాజెక్టు ఆఫీసర్ సుందరం, మున్సిపల్, కస్తూర్బా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు జానపద నృత్య పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీఈఆర్టీ ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా జానపద నృత్య కళలకు నిలయమన్నారు. సంస్కృతి సాంప్రదాయాలు జాతీ గౌరవాన్ని పెంచుతాయని, వాటిని నిరంతరం కొనసాగించాలని సూచించారు. జానపద కళల ద్వారా ఉపాధి కూడా పొందవచ్చన్నారు. అనంతరం పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. రూ.1800 నగదు విలువగల మొదటి బహుమతిని కౌటాల కేజీబీవీ విద్యార్థినులు సొంతం చేసుకోగా, ద్వితీయ బహుమతి రెబ్బెన కేజీబీవీకి రూ.1200 నగదు, తృతీయ బహుమతి చింతలమానేపెల్లి కేజీబీవీ విద్యార్థినులకు రూ.900 నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు_ కిల్లి వెంకట్‌రావు, సురేష్, ధర్మయ్య, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య బీమా ప్రతి ఒక్కరికి అవసరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్య బీమా ప్రతి ఒక్కరికి అవసరమని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధులు పెరగడంతో పాటు వాటి చికిత్స ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య బీమా ఎంతగానో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో. రీజినల్ ఏరియా హెడ్ అధికారి శేఖర్, బ్రాంచ్ ఇన్‌చార్జి నర్సింగోజు సాయికుమార్ చారి, బ్రాంచ్ మేనేజర్ ఐలయ్య, డీఓ సాయి కుమార్, ఏరియా హైద సురేష్ పాల్గొన్నారు.



బాలికపై లైంగిక దాడి

- కామాంధున్ని శిక్షించాలంటూ విద్యార్థుల రాస్తారోకో
- ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కామంతో కళ్ళు మూసుకుపోయిన ఓ కామాంధుడు 8వ తరగతి చదువుతున్న ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలికకు న్యాయం చేయాలంటూ తోటి విద్యార్థినులు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని ఓ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 8తరగతి చదువుతున్న బాలిక రోజు మాదిరిగానే శుక్రవారం సాయంత్రం పాఠశాల అనంతరం సైకిల్‌పై ఇంటికి వెళ్తుంది. ఈ క్రమంలో తనను గమనించిన అదే గ్రామానికి చెందిన నిందితుడు బొమ్మెన సాగర్(29) మద్యం మత్తులో ఒక్కసారిగా బాలికపై దాడికి దిగి బాలికను బలవంతంగా ఇంట్లోకి ఎత్తుకొని వెళ్లి లైంగికదాడి చేశాడు. బాలిక ఏడ్చుకుంటూ వెళ్లి కుటుంబ సభ్యులకు జరిగిన దుర్ఘటన గురించి చెప్పింది. బాలిక కుటుంబ సభ్యులు నిందితుడైన సాగర్ ఇంటికి వెళ్లి అడిగే ప్రయత్నం చేయగా తలుపులు పెట్టుకొని గది లోపలే ఉండిపోయాడు. తలుపులు తీయకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. బాలికను వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేశారు.

నిందితున్ని శిక్షించాలని రాస్తారోకో

జడ్పీ పాఠశాలల 8వ తరగతి చదువుతున్న బాలికపై లైంగికదాడి చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని బాలిక తోటి విద్యార్థులు, కుటుంబ సభ్యులు గ్రామస్తులు శనివారం బూరుగూడ వద్ద జాతీయ రహదారిపై ఉదయం ధర్నా నిర్వహించారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ రావాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గంటన్నర పాటు ధర్నా చేపట్టడంతో జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పట్టణ సీఐ సతీష్ తన బృందంతో ధర్నా వద్దకి చేరుకుని విద్యార్థులతో మాట్లడారు. నిందితుడికి కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని ఆందోళన చెందవద్దని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు



నిందితుడి అరెస్టు వివరాలను తెలియజేస్తున్న సీఐ సతీష్

గతంలోనూ నిందితుడిది ఇదే వైఖరి

బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడు సాగర్ వృత్తి రిత్యా డ్రైవర్‌గా పని చేస్తాడు. రోజు మద్యం మత్తులో ఉంటాడని అతని వైఖరి గతంలోను ఇదే తరహా ఉండేదని గతంలో ఇద్దరు మహిళలపై సైతం అత్యాచార ప్రయత్నం చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కాగ అతనికి భార్య ఓ కుమారుడు ఉన్నారని అతని వైఖరి వలన అతనికి దూరంగా ఉంటున్నట్లు తెలిసింది.

నిందితుని శిక్షించాలని ఎస్సీ సంఘాల వినతి

నిందితుడు ఎస్సీ కులానికి చెందిన వాడు కావడంతో ఆ వర్గానికి చెందిన నాయకులు స్పందించి భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా ఉండాలంటే నిందితుని కఠినంగా శిక్షించాలని బాలిక న్యాయం చేయాలని కోరారు. నిందితునికి శిక్షపడేలా చూడాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిందితునిపై కేసు నమోదు

బాలికపై లైంగికదాడి చేసిన నిందితునిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సతీష్ వెల్లడించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితునిపై బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 65(1)తో పాటు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలికకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. నిందితున్ని అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించామన్నారు.

భీమ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ-కెరమెరి

జిల్లాలోని జోడేఘాట్‌లో అక్టోబర్ 17న నిర్వహించనున్న కుమురం భీమ్ 84వ వర్ధంతి కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం మండలంలోని జోడేఘాట్‌లో గల మ్యూజియం హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్పీ శ్రీనివాసరావు, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, డీఆర్ఓ లోకేశ్వర్ రావు, కుమురం సోనేరావుతో కలిసి 29 శాఖల అధికారులు, కమిటీ నాయకులతో వర్ధంతి వేడుకల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రత్యేక పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అన్ని ఆదివాసీ సంఘాలు సహకరించాలని కోరారు. గతంలో కంటే ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. ఆదివాసీ, గిరిజనుల ఆరాధ్య దైవం, జల్‌జంగల్‌జమీన్ నినాదంతో ఆదివాసుల అభివృద్ధికి వీరోచితంగా పోరాడిన వీరుడు భీమ్ అని, ఆయన వర్ధంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, విద్య, పోలీసు శాఖల సమన్వయంతో కార్యక్రమాల నిర్వహణ, శాంతి భద్రతల పరిరక్షణ చర్యలు చేపట్టాలని, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జోడేఘాట్‌తో పాటు పరిసర గ్రామాలు, ప్రాంతాలలో ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేలా చూడాలని తెలిపారు. అనంతరం జోడేఘాట్‌లో దర్బార్ నిర్వహించే ప్రాంతం, హెలీ ప్యాడ్, వాహనాలు నిలుపే ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, కన్వీనర్ పెందూర్ మోతిరామ్, కమిటీ నాయకులు కనక ప్రభాకర్, మడావి రఘునాథ్, జగన్నాథరావు, ఆత్రం లక్ష్మణరావు, రాయి సెంటర్ జిల్లా సార్ మెడి సీతారాం, కుమ్రం సూరు వర్ధంతి కమిటీ చైర్మన్ మడావి రాజు, పర్ధాన్ సంఘం నాయకులు పెందోర్ సుధాకర్, నాయక్ పోడ్ సంఘం నాయకులు, ఆదివాసీ నాయకులు, మాజీ జడ్పీటీసీ సెడ్మాకి ద్రుపదబాయి పాల్గొన్నారు.

ఆదివాసీ సంప్రదాయం ఉట్టిపడాలి

భీం వర్ధంతికి వచ్చే ఆదివాసులు సంప్రదాయం ఉట్టిపేల గిరిజన దుస్తులు ధరించి రావాలని భీం వర్ధంతి ఉత్సవ కమిటీ చైర్మెర్ పెందూర్ రాజేశ్వర్ కోరారు. వర్ధంతిని సమన్వయంతో నిర్వహించాలన్నారు. వర్ధంతికి వచ్చే ప్రజలు, ఆదివాసులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. హట్టి నుండి జోడేఘాట్ వరకు రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలి, మార్గమధ్యలో అటవీ అనుమతులు లేకుండా ఆగిన వాటిని పూర్తి చేయాన్నారు. అదే విధంగా కోలాం గూడ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు.



మాట్లాడుతున్న భీం వర్ధంతి ఉత్సవ కమిటీ చైర్మెన్ పెందూర్ రాజేశ్వర్

యువత ప్రశ్నించే చైతన్యాన్ని అలవర్చుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సమాజంలో జరిగే అన్యాయాలపై ప్రశ్నించే చైతన్యాన్ని యవత అలవర్చుకోవాలని, ఇదే భగత్‌సింగ్‌కు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ భారత యువత ఆకాంక్షల ప్రతిరూపం భగత్‌సింగ్ అని అన్నారు. దేశ విముక్తి కోసం తన ప్రాణాన్నే ఫణంగా పెట్టిన యోధుడు అన్నారు. ఆయన ఆశయసాధన కోసం ఆయన చూపించిన మార్గంలో సమాజంలో జరిగే అన్యాయాలపై పోరాటం చేయడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వసాకె సాయికుమార్, ఉపాధ్యక్షులు తుమ్మిడె భీమేష్, సహాయ కార్యదర్శి సిరికొండ సతీష్, సుంకరి సాయికుమార్ పాల్గొన్నారు.

కౌటాల : ఎస్ఎఫ్ఐ మండల కమిటీ అధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎల్ములై సాయినాథ్, మండల అధ్యక్షుడు దుర్గం అంకిత్, కమిటీ సభ్యులు ఉమేష్, ప్రసాద్, అఖిల్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇందిరాపార్క్ ధర్నాలో జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గురుకులాల సమస్యలపై టీఎస్ యూటీఎఫ్, గురుకులాల జేఏసీ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు జిల్లాలోని గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకుడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పరి సత్యనారాయణ మాట్లాడుతూ గురుకులాల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్, అవుట్ సోర్సింగ్, గెస్ట్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కెల్ ఇస్తూ 12 నెలల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలపై ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి వివరించినట్లు తెలిపారు. ఆయన సానూకులంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా భాద్యులు గణేష్, ఉపాద్యాయులు నరేష్, సుధాకర్, వెంకటేశం, వాసు, సంతోష్, కృష్ణ పాల్గొన్నారు.



అశాస్త్రీయమైన జీఓ 25ను సవరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయుల రేషనలైజేషన్ విధానంలో అసమంజసమైన, అసంబద్ధమైన జీఓ నెంబర్ 25ను సవరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓ లోకేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ నాయకులు సోయం ఇందు రావు, జాదవ్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అశాస్త్రీయమైన సర్దుబాటు జీఓ 25ను సవరించాలన్నారు. సర్దుబాటుకు ముందే బదిలీ ఎస్జీటీలను రిలీవ్ చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికొక టీచరు ఉండాలని, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు ఉండాలని, ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మీడియం వారీగా లెక్కించాలని, అదనపు ఉపాధ్యాయులను 1:30 నిష్పత్తిలో లెక్కించాలన్నారు. జీఓ నెంబర్ 25ను గత ప్రభుత్వం ఏకపక్షంగా 2021 ఆగస్టులోనే తీసుకువచ్చిందని అప్పుడు వ్యతిరేకత రావడంతో నిలిపివేశారని, దానిని ఇప్పుడు అమలు చేస్తున్నారని దీనివల్ల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి మూసివేసే ప్రమాదం ఉంటుందన్నారు. జీఓ నెంబర్ 25ను సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హేమంత్ షిండే, తంగడిపల్లి రమేష్, చాకటి శ్యామ్ రావు, రాథోడ్ రవీందర్, సంజయ్ కుమార్, బాధిరావ్, మాన్కు, కిషన్, ఆనంద్ రాజ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థి మహాగర్జనకు హైద్రాబాద్‌కు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం కాగజ్‌నగర్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తాము విద్యార్థి మహాగర్జన చేపడితే సమస్యలు పరిష్కరించలేని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నూతన విద్యావిధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రైవేట్, కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టే యోచనకు రాష్ట్ర ప్రభుత్వం కూడా వంత పాడుతోందని అన్నారు. అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని, ఎస్ఎఫ్ఐ నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తుమ్మిడె భీమేష్, సిరికొండ నితీష్, సుంకరి సాయికుమార్ పాల్గొన్నారు.

సికిల్ సెల్ నిర్మూలనే ధ్యేయం



నవతెలంగాణ-వాంకిడి

2047 నాటికి సికిల్ సెల్ నిర్మూలనే ధ్యేయంగా కేంద్రప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తుందని వైద్యులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో నేషనల్ సికిల్ సెల్ నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ ఉప్రే మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి జన్యూ పరంగా వచ్చేవ్యాధి అని దీనిని ప్రారంభ దశలో గుర్తిస్తే జన్యూ పరంగా రాకుండా నివారించవచ్చన్నారు. చికత్సకు అనుకూలంగా ఉంటుందని, దీని లక్షణాలు దీర్ఘకాలిత రక్తహీనత, ఎముకలలో తీవ్రమైన నోప్పి ఉంటుందని, అలాంటి వారు ఎవరైనా ఉంటే ఆరోగ్యకేంద్ర సిబ్బందికి ఆశా, ఏఎన్ఎం లేదా డాక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జావిద్, ఎంఈఓ శివచరణ్, ఎంపీఓ స్రావన్ కుమార్, హెచ్ఈఓ రవిదాస్, పీహెచ్ఎన్ క్రిష్టియానా, హెచ్ఎం భగవాన్ దాస్, అధికారులు పాల్గొన్నారు.

పవన్‌కు సంఘీభావంగా పూజలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన లడ్డూ అపవిత్ర చర్యలను నిరసిస్తూ, సనాతన ధర్మ పరిరక్షణ కోసం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేపడుతున్న దీక్ష విజయవంతం కోసం స్థానిక జనసేన కార్యకర్తలు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బాలాజీనగర్‌లోని శ్రీ వెంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహించి తిరుపతి లడ్డూ అపవిత్రతకు కారకులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పోతుల ప్రవీణ్, ఎ బాలేష్, రాజేష్, మనీష్, గణేష్, సాయికృష్ణ, వినీష్ రెడ్డి, అల్లూరి సాయికుమార్ పాల్గొన్నారు.

సీడ్ బాల్స్‌తో పర్యావరణ సమతుల్యం సాధ్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సీడ్ బాల్స్‌తో పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆసిఫాబాద్ అధ్యక్షుడు కొలిపాక శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో వాసవి క్లబ్ ఆసిఫాబాద్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులతో రూ.12వేల సీడ్ బాల్స్ తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే అవకాశం లేని చోట సీడ్ బాల్స్ ఉపయోగపడతాయని అన్నారు. దీనితో అన్ని ప్రాంతాల్లో మొక్కలు పెరిగి వాతావరణ సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ కోశాధికారి చిలువేరి శ్రీధర్, సభ్యులు ఎకిరాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావుల శంకర్, నాయకులు గుండా ప్రమోద్, కొడిపాక వేణుగోపాల్, శ్రీ సరస్వతీ శిశుమందిర్ హెచ్ఎం కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | సెప్టెంబర్ 29, 2024 | www.navatelangana.com

భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలి

నవతెలంగాణ-తాండూర్



యువత భగత్ సింగ్ అడుగుజాడల్లో నడవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ కోరారు. శనివారం బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పుట్టిన భగత్‌సింగ్ విద్యార్థి దశ నుండే దేశ స్వాతంత్రం కోసం పోరాటాలు ప్రారంభించారని తెలిపారు. విద్యార్థులను, యువత కుల మతాలకతీతంగా అన్యాయాలపై ఉద్యమించారన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు యువత దేశ ప్రజలు కలిసి పోరాడటం చేసిన రోజు భగత్ సింగ్‌కు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రిషెందర్, సాయి, రవితేజ, పల్లవి పాల్గొన్నారు.

నూతన ఎంఈఓకు ఘన సన్మానం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన హెలెన్ డారతిని సీఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చ్ ప్రెస్బిటర్ ఇన్‌చార్జి పాఠశాల కరస్పాండెంట్ ఎస్ డేవిడ్ పాల్ మాట్లాడుతూ మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తన వంతు బాధ్యతగా విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహజ్యోతి పత్రాల అందజేత



నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 6 గ్యారంటీల్లో గృహ జ్యోతి పథకం కింద రూ.500 గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన పత్రాలను అర్హులందరికీ శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డ్‌లో అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పెద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. అక్టోబర్ మొదటి వారంలో అందరికీ కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్‌తోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యమని, రాబోయే రోజుల్లో అన్ని హామీలను అమలుచేసి అర్హులందరికీ న్యాయం చేస్తుందని తెలిపారు. అనంతరం ఇటిక్యాల చెరువు ట్యాంక్ బండ్ వద్ద 400ల ఈత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు సురేష్ నాయక్, గడి కొప్పుల ఉమా, గొల్ల కాంతయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కారోబార్లకు కనీస వేతనం ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-జన్నారం

గ్రామంలో కారోబార్లుగా పని చేస్తున్న వారికి కనీస వేతనం ఇవ్వాలని, జీఓ 51 రద్దు చేయాలని శనివారం మండల కారోబార్ల సంఘం ఆధ్వర్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కారోబార్ల బిల్ కలెక్టర్ల జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కారోబార్లుగా కొనసాగుతున్నమన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జీఓ 51ని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో బాపన్న శ్రీనివాస్, వివిధ గ్రామాలకు చెందిన కారోబార్లు పాల్గొన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మాదిగల మేలుకొలుపు యాత్రలో బాగంగా మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి లక్షెటిపేట మున్సిపాలిటీలో పర్యటించారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, జనాభా ప్రతిపాదికన జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ అమలు చేసి రిజర్వేషన్ వర్తింప జేయాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో కూడా రిజర్వేషన్ అమలు చేసి మాదిగల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడపట్ల దుబ్బన్న, కొల్లూరి రవి కుమార్, దర్శనాల నవీన్ కుమార్, అడ్లూరి కాంతారావు, చిప్పకుర్తి నాగరాజు, అడ్లూరి సతీష్ పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిలో రోడ్డు ప్రమాదం

- అక్కడికక్కడే యువకుని మృతి



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని ఇందారం సమీపంలో రాజీవ్ రహదారిపై శుక్రవారం అర్థ రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మంచిర్యాల వైపు నుంచి గోదావరిఖని వైపు మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తూ సిర్ర ప్రవీణ్(25) రోడ్డు ప్రమాదంలో అక్కడిక్కడే మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరాండ్ల గ్రామానికి చెందిన సిర్ర ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానిక అదనపు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ప్రవీణ్ తన స్నేహితుడైన పొన్నం అజయ్‌తో కలిసి శుక్రవారం మంచిర్యాలలోని బంధుల ఇంటికి వచ్చి తిరిగి వెలుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వాహణాల లైట్ వెలుతురులో కండ్లు సరిగ్గా కన్పించక రోడ్డు దాటుతున్న బర్రెను మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్‌తో పాటు మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న పొన్నం అజయ్ తీవ్రంగా గాయపడగా వైద్య సేవల నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యుల సూచనల మేరకు అక్కడి నుండి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడు సిర్ర నాగరాజు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్



కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని కాంట్రాక్టు కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయు ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏఓ రాజేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్ల అన్ని రంగాలలో తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు. 1991 నుంచి అనుసరిస్తున్న ఈ విధానాల వల్ల ఉద్యోగ భద్రత పోయి హైర్ అండ్ ఫైర్ సిస్టమ్ వచ్చిందని, 2014 నుంచి కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాల్లో మార్పు చేశారన్నారు. 29 చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని, కనీస వేతనానికి గ్యారంటీ లేకుండా చేసిందని, 8 గంటల పనిదినానికి బదులు 12 గంటల పనిదినం ప్రవేశపెట్టిందన్నారు. యజమానులకు అనుకూలంగా కార్మిక శాఖను ఫెసిలిటేట్ డిపార్టుమెంట్‌గా మార్చిందని, పర్మినెంట్ వ్యవస్థను, హక్కులను పూర్తిగా రద్దు చేసిందన్నారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, క్యాజువల్ విధానాలలో టెంపరరీ, డైలివేజ్, అప్రెంటీస్, పీస్ రేటెడ్, హెరీమ్ బేస్డ్ వర్కర్స్ పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నదని అన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రయివేట్ పరిశ్రమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, శాఖల్లోని కాంట్రాక్ట్-ఔట్సోర్సింగ్, యూనివర్సిటీ నాన్ టీచింగ్, మున్సిపల్, గ్రామ పంచాయితీ తదితర స్థానిక సంస్థలు, వైద్య ఆరోగ్య రంగం, విద్యుత్ రంగం, సింగరేణి, ఆర్టీసీ తదితర రంగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కనీస వేతనాలు పెంచాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, 1979 వలస కార్మిక చట్టం పటిష్ఠంగా అమలుపర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజేశ్వరి, గోమాస ప్రకాష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజన్న, మహేందర్, సింగరేణి కాంట్రాక్ట్, కన్వేయన్స్ కార్మికులు, మున్సిపల్, హాస్టల్ వర్కర్స్ పాల్గొన్నారు.

ఢిల్లీకి బయలుదేరిన కార్మిక సంఘాల నాయకులు

నవతెలంగాణ-జైపూర్

దీపావళి బోనస్ చెల్లింపు విషయమై కార్మిక సంఘాల నాయకులు శనివారం ఢిల్లీ బయలుదేరి వెల్లారు. కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) యాజమాన్యంతో కలిసి బొగ్గు కార్మికులకు చెల్లించే బోనస్ విషయాన్ని చర్చించనున్నారు. సీఐఎల్ యాజమాన్యం ఢిల్లీ వేదికగా కార్మిక సంఘాల నాయకులతో కలిసి బోనస్ చెల్లింపును నిర్ణయించనుంది. స్టాండర్డైజేషన్ కమిటి సభ్యులతో ఆదివారం 3 గంటల సమయంలో సమావేశం కానుండగా ప్రధాన నాలుగు యూనియన్ల నాయకులు బోనస్ చెల్లింపును ప్రతిపాదించనున్నారు. ఈ విషయంలో ఇప్పటికే కార్మిక సంఘాల నాయకులు అంతర్గతంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. దీపావళి బోనస్‌గా కార్మికులు ఆశించిన మేరకు బోనస్ నిర్ణయించడం కోసం సీఐఎల్ సమక్షంలో తమ వాని వినిపించనున్నట్లు తెలిసింది. బొగ్గు కార్మికుల పనీ తీరు లింక్డ్ రివార్డు గౌరవప్రదంగా ఉండే విధంగా సీఐఎల్ యాజమాన్యంతో జరిపే చర్చల్లో ఆశించిన మేరకు ఫలితాన్ని పొందాలని యూనియన్ నాయకులు ఆకాంక్షిస్తున్నారు. 2023 సంవత్సరంలో బొగ్గు కార్మికులు రూ. 85, 500 చొప్పున బోనస్ చెల్లించగా ఈ ఏడాది రూ. లక్ష వరకు డిమాండ్ చేసి సీఐఎల్‌ను ఒప్పించాలని కార్మిక సంఘాల నాయకులు భావిస్తున్నారు. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో కోల్ ఇండియా రూ.37.369 కోట్ల లాభాలను ఆర్జించింది. ఈ క్రమంలోనే బొగ్గు కార్మికులకు గౌరవ ప్రదమైన బోనస్ చెల్లించే విధంగా కృషి చేయాలని యూనియన్ నాయకులు భావిస్తున్నారు..

బకాయిలను వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.33,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు, శాశ్వత వేజ్ బోర్డ్ సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6,7 గనులలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతి, సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందన్నారు. గత ప్రభుత్వం రూ.29 వేల కోట్ల బాకీ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.4,000 కోట్ల పెరిగి రూ.33000 కోట్లు అయిన బకాయిని వెంటనే చెల్లించాలని, అదేవిధంగా సింగరేణిలో ప్రభుత్వం ప్రమేయం ఎక్కువయి నిజాయితీగా పనిచేసే అధికారులు ప్రభుత్వం మాట వినటం లేదని వారిని తొలగించటాన్ని, భయ పెట్టడాన్ని మానుకోవాలని అన్నారు. సింగరేణికి నష్టం జరిగేటట్లుగా ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అవసరమైతే పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. నూతనంగా సింగరేణిలో నియామకమైన కార్మికులు సింగరేణిలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగించుకొని సింగరేణికి నష్టం జరిగేటట్టుగా ప్రభుత్వం గాని యాజమాన్యం గాని తీసుకునే నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, ఏరియా కార్యదర్శి మారుపల్లి సారయ్య, గొర్రె నర్సయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శులు సంఘం సదానందం, బిర రవీందర్, చంద్రశేఖర్, చిలక రామచందర్, పవన్, రేగుల శంకర్, వంశీ,రాజకుమార్, దొడ్డిపట్ల రవీందర్ పాల్గొన్నారు.

విభిన్న ఆలోచనలతోనే శాస్త్రవేత్తలవుతారు: డీఈఓ

నవతెలంగాణ-జైపూర్



సైన్స్ సంబంధిత విభిన్న తార్కిక ఆలోచనల ద్వారా శాస్త్రవేత్తలుగా తయారవుతారని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. అటల్ టింకర్ ల్యాబ్ ప్రాజెక్టుల ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలను అభినందించారు. ఇంటువంటి సైన్స్ సంబంధిత ఆలోచనలతో శాస్త్రవేత్తలుగా రాణించగలరని పేర్కొన్నారు. సైంటిస్టులు తయారు కావడానికి అటల్ టింకర్ ల్యాబ్ దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలో ఇటువంటి ల్యాబులు ఎనిమిది మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటి ఈ పాఠశాలలో చదువుకోవడం అదృష్టంగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ మదుబాబు, జిల్లా కోఆర్డినేటర్ చౌదరి, అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ మద్దుల సునిత, స్థానిక మండల విద్యాదికారి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలీస్ మాధుర్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లాభాల్లో వాటా కల్పించిన ఘనత ఏఐటీయూసీదే



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటాహక్కును కల్పించిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందనికాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ అన్నారు. శనివారం ఆర్కే-7 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు అనేక సంవత్సరాలుగా సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని దశలవారీగా ఆందోళనలు కార్యక్రమాలు చేపట్టారన్నారు. దాని ఫలితంగా కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఈ లాభాల వాటా హక్కు కొరకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజకుమార్‌లకు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు భవిష్యత్తులో కూడా కోల్ ఇండియాలో అమలుతున్నటువంటి హైపర్ కమిటీ వేతనాలు గాని రాష్ట్ర ప్రభుత్వం 22 జీఓగాని అమలు అయ్యేంత వరకు దశలవారీగా పోరాటం నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా జైపూర్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు బాలకృష్ణ గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో విధులకు హాజరు కాలేకపోయాడని, తన ఆరోగ్యం కుదుట పడిన తర్వాత విధులకు తీసుకోవాలని కోరగా యాజమాన్యం కాంట్రాక్టర్ విధులకు తీసుకోమని చెప్పడంతో మనస్థాపానికి గురైన బాలకృష్ణ ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కార్మికుని చావుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని (ఏఐటీయూసీ) సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తరపున డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా సహాయ కార్యదర్శి వేల్పుల తిరుపతి, కాంట్రాక్ట్ కార్మికులు శ్రీనివాస్, దిలీప్, విక్కీ, ఆదిత్య పాల్గొన్నారు.

చేతిపంపుల వద్ద శుభ్రత పాటించాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చేతిపంపుల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ గ్రేడ్ డీఈ వెంకటేశ్వర్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశం మందిరంలో వివిధ గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చేతిపంపులు చెడిపోకుండా చూడాలన్నారు. చేతిపంపుల వద్ద మురుగునీటి ట్యాంకులు లేకుండా చూసుకోవాలన్నారు. చెడిపోయిన చేతిపంపులను ఎప్పటికప్పుడు రిపేరు చేయించి ప్రజలకు మంచినీరు అందించాలన్నారు. చేతిపంపులు చెడిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అబ్రహం మండల అధికారులు వివిధ గ్రామాలకు చెందిన ఎంపీడబ్ల్యు వర్కర్స్ పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి



నవతెలంగాణ-జైపూర్

ఇంటిలో పెంచుకునే కుక్కలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని భీమారం పశువైద్యాధికారి రాకేష్ శర్మ సూచించారు. ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరింకుని శనివారం పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటిలో తిరుగుతూ ఉండే కుక్కలకు టీకాలు వేయడం ద్వార కుక్కలను వ్యాధుల నుంచి కాపాడుకోవడమే కాకుండా ఇంటి యజమానులు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. కాగా కుక్కలకు వచ్చే రెబీస్ వ్యాధి పట్ల వాటి యజమానులకు అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు నర్సింహులు, సంపత్, పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు..

పంటలను తెగుళ్ల నుంచి కాపాడుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

రైతులు తమ పంటలను తెగుళ్ళ భారి నుంచి కాపాడుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. శనివారం మండలంలోని బాదంపల్లి గ్రామ శివారులో రైతుల పొలాల్లో వేసిన పత్తి, వరి తదితర పంటలను పరిశీలించారు. పంటల్లో సస్యరక్షణ, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వరిలో సుడిదోమ మొగిపురుగు ఆకుముడత పురుగు తెగులు గమనించడం జరిగిందని తెలిపారు. సుడిదోమ నివారణకు బ్యుప్రోఫెజిన్ పిచ్కారి చేయాలన్నారు. మొగి పురుగు ఆకు ముడత పురుగుల నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ నీటితో పిచికారి చేయాలన్నారు. మొదటి దశలో సింథటిక్ పరిథరాయిడ్స్ వాడడం వలన వరి పత్తిలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరుగుతుందన్నారు. ముందుగా కాలిబాటలు తీయడం వలన సుడిదోమ ఉధృతి తగ్గించవచ్చని, సాయంకాల సమయంలో గట్లపై మంటలు వేయడం వలన పురుగుల ఉధృతి తగ్గించవచ్చు అన్నారు. పత్తిలో గులాబీ రంగు మరియు రసం పీల్చే పురుగులను గమనించడం జరిగిందన్నారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో రైతులు చెట్పల్లి లచ్చన్న, చీపిరిశెట్టి రాజన్న, మోటపలుకుల కలవ్వ, ఏతఓ త్రిసంధ్య రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

సీజనల్‌గా వచ్చే వ్యాధులతో పాటు అనారోగ్య రుగ్మతులు ఏర్పడకుండా ఆరోగ్య పరిరక్షణ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ముస్తఫా సూచించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం భీమారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిభిరంలో గ్రామస్థులకు వైద్య పరిక్షలు నిర్వహించారు. ఈ సంధర్బంగా గ్రామానికి చెందిన 42 మంది నుంచి హెచ్ఐవీ పరిక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. గుండె సంబంధిత వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్మికులకు వైద్య పరిక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ముస్తఫాతో పాటు ఎంపీడీఓ మదుసూదన్, ఏఎన్ఎం ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.

నవతెలంగాణ

5

ఆదిలాబాద్

ఆదివారం | సెప్టెంబర్ 29, 2024 | www.navatelangana.com

విజేతలకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-బోథ్

భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించిన భగత్ సింగ్ టాలెంట్ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. శనివారం ఎంపికైన అభ్యర్థులకు బహుమతులు, స్కాలర్‌షిప్‌లను పోటీ పరీక్షల నిపుణులు రమణ గౌడ్, బి.గోవర్ధన్, జే.శ్రీకాంత్, షాకీర్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా, మండల అధ్యక్షుడు మున్సిఫ్, నాయకులు సిరిపురం దాస్, గోదావరి, భోజన్న, ఎల్.నరేష్, కార్తీక్, శ్రీనివాస్, విజయ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో..

మండలకేంద్రంతో పాటు సొనాల గ్రామంలోని భగత్ సింగ్ 117వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా స్వేరో మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోనీ అంబేద్కర్ భవనంలో స్వేరో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి స్వేరో జిల్లా అధ్యక్షులు డోంగ్రే సురేష్, మీడియా ఇన్‌చార్జి దుర్గం విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు మహేందర్, ఎమ్మెస్ డబ్ల్యూ మమత హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించారు. స్వేరో అనే సంస్థ సామాజిక సేవ సంస్థ, కులమతాలు, పార్టీలకు అతీతంగా పనిచేస్తుందన్నారు. ఆర్థిక, అక్షరం, ఆరోగ్యం అనే అంశాల మీద పనిచేస్తుందని తెలిపారు. నూతన కమిటీలో మండల అధ్యక్షుడుగా లోకండే భాస్కర్, ఉపాధ్యక్షులుగా డోకే రాకేష్, జనరల్ సెక్రటరీ షేక్ షారుక్ ఖాన్, సోషల్ మీడియా ఇన్‌చార్జి జాడి కార్తీక్, ట్రెజరీ రాంటెంకి రాజు, స్పోక్‌పర్సన్‌గా అశోక్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎడ్ల అశోక్, రౌతు సుదర్శన్, గులాబ్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో స్వేరో సభ్యులు రౌతు గౌతం, శ్యంరావ్ పాల్గొన్నారు.

పత్తి పంటలో గంజాయి సాగు.. పోలీసుల దాడులు



నవతెలంగాణ-ఇచ్చోడ

గుట్టు చప్పుడు కాకుండా పత్తి పంటలో అంతర పంటగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను శనివారం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. సీఐ భీమేష్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఇచ్చోడ మండలంలోని గుబ్బా గ్రామ శివారులోని రైతు మాణిక్య రావు 3 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేసి అంతర పంటగా 30 గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంటలో ఏపుగా పెరిగిన సుమారు 30 గంజాయి మొక్కలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.45,000 వరకు ఉంటుందన్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చెప్పటినట్లు సీఐ భీమేష్ తెలిపారు. దాడుల్లో ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి



నవతెలంగాణ-నార్నూర్

ప్రయివేటు పాఠశాలలో చదివే విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించాలని ప్రయివేటు పాఠశాలల సంఘం కరెస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు కోరారు. నూతంగా ఎంఈఓ గా బాధ్యతలు స్వీకరించిన పి.అనితను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి స్వాగతం తెలిపారు. అనంతరం వారు పరిచయం చేసుకొని సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని పాఠశాలల కరెస్పాండెంట్ జాదవ్ ఉమాజి, సాంబన్న, గిరిబాబు, దుర్గే మిలింద్ ఉన్నారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన జర్నలిస్టులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తొలిసారి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారదను జిల్లా జర్నలిస్టులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో నాలుగు రోజుల పాటు విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా శనివారం ఆమె జిల్లా కేంద్రంలోని పెన్ గంగా గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం జర్నలిస్టులు ఆమెను కలిసి పుష్ప గుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం కాసేపు ఆమెతో మాట్లాడారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

డబ్ల్యూపీఎస్, జీఏ 91వ వార్షిక క్రీడ పోటీల్లో భాగంగా శనివారం గోలేటిలోని సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సహంగా సాగాయి. దీనికి బెల్లంపల్లి ఏరియా సివిల్ ఎస్ఈ బాషా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్ బాల్ , క్రికెట్‌లాకబడ్డీ కూడా ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి మంచి ఆదరణ పొందిందని తెలిపారు. గతంలో కోల్ ఇండియా స్థాయిలో ప్రతిభ కనబరిచిన కబడ్డీ ఉద్యోగ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ కిరణ్, జనరల్ క్యాప్టెన్ చంద్రకుమార్, ఏఐటీయూసీ నాయకులు బి.జగ్గయ్య, జూపాక రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజా మార్గం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కక్షిదారులు పట్టింపులకు వెళ్లకుండా రాజీ కుదుర్చుకొని కేసులను పరిష్కరించుకోవాలని సిర్పూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ అన్నారు. శనివారం సిర్పూర్ జూనియర్ సివిల్ కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న 340 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కక్షదాయాలకు రాజీపత్రాలను అందించారు. రాజీమార్గంతోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ కుమార్, ప్రధాన కార్యదర్శి గణపతి, సీనియర్ న్యాయవాదులు శంకర్, రైస్ అహ్మద్, గంట కళ్యాణ్, శ్రీనివాస్, సతీష్ ఉన్నారు.

కేంద్రం విధానాలపై
భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి





- ప్రజా సంఘాల నాయకులు
- ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించడానికి ప్రతి ఒక్కరు మరో భగత్ సింగ్‌ల పోరాడాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డివైఎఫ్ఐ కార్యదర్శి కార్తీక్‌తో పాటు ప్రజాసంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారతీయులను అణచివేసిన ఇంగ్లాండ్ వారిపై భగత్ సింగ్ చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. స్వతంత్ర భారతంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆంగ్లేయులకు ఎదురొడ్డి పోరాడిన భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని యువత మరో భగత్ సింగ్‌లా పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని కార్యాలయాలలో అవినీతి పెచ్చుమీరి పోతున్న అడిగే వారు కరువయ్యారని భగత్ సింగ్ ఆదర్శంగా దీనిపై పోరాడాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత పోరాడితే సమాజాన్ని మార్చవచ్చనేది ఆయన ద్వారా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కోరింగ మాలశ్రీ, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావణి, నాయకులు నిఖిల్, చిట్టి పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తికానంద్ మాట్లాడుతూ నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, భగత్‌సింగ్ చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలన్నారు. అనంతరం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడె శ్రావణి, మండల ఉపాధ్యక్షుడు జాడి తిరుపతి, కళాశాల కన్వీనర్ శ్రావని, విద్యార్థులు పాల్గొన్నారు.

హేతుబద్ధీకరణ ఉత్తర్వులను సవరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాఠశాల విద్య- ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులను సవరణ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ.వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఓ నెం.25ను గతంలో ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించడంతో నిలుపుదల చేశారని, ప్రస్తుతం సర్దుబాటు నిమిత్తం విడుదల చేసిన ఆర్‌నెం.1267 ఉత్తర్వులు కూడా శాస్త్రీయంగా లేవని అభిప్రాయపడ్డారు. ఈ ఉత్తర్వులను సవరణ చేసి బోధనకు ఆటంకం లేకుండా సవరణ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. తరగతి గదికొక ఉపాధ్యాయుడు ఉండాలని చెప్పిన నిబంధనలను అమలు చేయకపోవటాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా, 20 మందికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ప్రాథమిక పాఠశాలల్లో, ఉన్నత పాఠశాలల్లో ఒకసెక్షన్‌కు ఒక పాటర్న్ చొప్పున ఉండే విధంగా ఉపాధ్యాయులను కేటాయించాలని తెలిపారు. జీఓ. నెం.25ను సవరించిన తర్వాతనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. బదిలీ కాబడి, రీలివ్ చేయని ఉపాధ్యాయులను వెంటనే రీలివ్ చేసి, నూతన పాఠశాలలో విద్యార్థులకనుగుణంగా సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు, పదోన్నతుల అప్పీళ్లను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. బోధనేతర పనులు, పాఠశాలల పర్యవేక్షణ నిమిత్తం ప్రతి ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలన్నారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని, ఆంగ్లం, తెలుగు మీడియం ఉన్న పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులను ఆయా మీడియానికి వేరువేరుగా పూర్తిస్థాయి ఉపాధ్యాయులు ఉండాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏ.స్వామి, ఉపాధ్యక్షులు సూర్యకుమార్, సురేఖ, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణరావు, జిల్లా కోశాధికారి కె.కిష్టన్న, జిల్లా కార్యదర్శులు కే. శ్రీనివాస్, గౌస్ మొహియుద్దీన్, కె.గణేష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కొల్లూరి శంకర్, వివిధ మండలాల బాధ్యులు జయకర్, మహేందర్, రాజశేఖర్, అశోక్, గంగాధర్, విట్టల్, మల్లయ్య, రవికుమార్, గణేష్, సభ్యులు నారాయణ, రాజు పాల్గొన్నారు.

హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

నవతెలంగాణ-జైపూర్



ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యుడు పైళ్ల ఆశయ్య విమ్మర్శించారు. సీపీఐ(ఎం) నాయకులు కావేరి రవి, బోండ్ల సరిత అధ్యక్షతన శనివారం చెన్నూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) ఏరియా మహాసభలో జిల్లా కార్యదర్శి సంకె రవితో కలిసి ఆయన పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని, రూ.2 లక్షల రుణమాఫీ మరుగున పడేసిందని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి, కాదంటే ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్య వైద్యం ప్రతి ఒక్కరికి అందించే విధంగా చూడాలని, ప్రతి ఒక్క విద్యార్థికి చదువు అందించే బాధ్యత ప్రభుత్వాలదే, నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల ఎలాంటి షరతుల లేకుండా రుణమాఫీ చేయాలని, గ్రామాలలో రోడ్లు, కాలువలు నిర్మించాలని అన్నారు. పోడుసాగు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, అటవీశాఖ దౌర్జన్యాలు ఆపివేయాలని కోరారు. చెన్నూర్ ప్రాంతంలో కుల వివక్ష కొనసాగుతుందని, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం చెన్నూర్ ఏరియా కమిటని ఏకగ్రీవంగా ఎన్నుకోగా కార్యదర్శిగా బోడంకి చందు, కమిటి సభ్యులుగా కావేరి రవి, బోండ్ల సరిత, సిడ్డం సమ్మక్క, కరీంబీ, ఆత్రం శ్రావణ్ కుమార్, రాతపల్లి నాగేష్, నాగజ్యోతి, ఉమారాణి, మారయ్య, పేదం పద్మ ఎన్నికయ్యారు. ఈ మహాసభలో పాయిరాల రాములు, తాండ్ర అనిల్ బండారి రాజేశ్వరి, రేణుక, యామిని, రమాదేవి, సహాన, మధు, కుమార్, లక్ష్మి, భూదక్క పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-తాండూర్

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ సూచించారు. శనివారం తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోయపల్లి హైవేవద్ద ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై సూచనలు చేశారు. బోయపల్లి బోర్డ్ గ్రామాలలో రాత్రి వేళలో పశువులు జాతీయ రహదారిపై బస చేస్తున్నాయని, సంబంధిత పశువుల యజమానులు గమనించి పశువులను ఇంటి వద్దనే ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని అన్నారు. వాహన యజమానులు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. యువకులు త్రిబుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువకులు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలి

నవతెలంగాణ-వేమనపల్లి



గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు అన్నారు. శనివారం మండలంలోని నీల్వాయి గ్రామ పంచాయతీని పీస్ ఆఫ్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని, ఎక్కడ కూడా ప్లాస్టిక్ బాటిల్స్, కవర్స్ లేకుండా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని తెలిపారు. బృహత్ పల్లె ప్రగతి వనాన్ని సందర్శించి మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని, గ్రామ పంచాయితీలలో ఎవెన్యూ ప్లాంటేషన్ పరిశీలించి వందశాతం బతికే విధంగా మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగించాలని, నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమలు, ఈగలు ద్వారా ప్రజలు వ్యాధుల భారిన పడే అవకాశం ఉన్నందున ఫాగింగ్ చేయించాలని, నాలాల పూడిక తీయంచాలని పంచాయితీ కార్యదర్శికి సూచించారు. అనంతరం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా కిరాణా షాపుల వారికి ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతి అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాల క్రీడ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాల మైదానంలో జిల్లా స్థాయిలో వివిధ రకాల పోటీల్లో క్రీడాకారులను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ప్రధాన కార్యదర్శి సాంబశివరావు నేతృత్వంలో ఎంపిక చేశారు. జిల్లాలోని అండర్ 17 బాల బాలికలకు హ్యాండ్ బాల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించగా కన్వీనర్‌గా క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోచ్ అరవింద్ వ్యవహరించారు. పోటీలను ఏసీఎంఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. వందమందికి పైగా పాల్గొన్న పోటీల్లో 16 మంది బాలురు, 16 మంది బాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 30న నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నట్లు వివరించారు. కార్యక్రమానికి గిరిజన ఆశ్రమ పాఠశాలల క్రీడాధికారి మీనారెడ్డి, కోచ్‌లు రాకేష్, రవి, పీడీ, పీఈటీ విద్యాసాగర్, సాయి, రజిత, యాదగిరి, ప్రమోద్ పాల్గొన్నారు.

చెస్ పోటీలు ప్రారంభించిన మాజీ ఎంపీపీ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 14, 17 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలను మాజీ ఎంపీపీ మల్లికార్జున్ ప్రారంభించి, విద్యార్థులతో చెస్ ఆడి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. చెస్ పోటీలకు కన్వీనర్‌గా చౌపన్‌గూడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీఈటీ రవి వ్యవహరించారు. చెస్ క్రీడల్లో 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు శారద, లక్షణ్, ఇందిరా, తిరుపతి, రజిత, కల్పన, శృతి, కృష్ణమూర్తి, రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మహిళల చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మహిళ చట్టాలపై మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ప్రాథమిక ఉన్నత ఆశ్రమ పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి సునీత మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు ఫేస్ బుక్, వాట్సప్, ఇన్స్‌స్టాగ్రామ్ వాటి వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని, ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షీ టీం ఆసిఫాబాద్ ఫోన్ నంబర్ 8712670564ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు శ్రీలత పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

నవతెలంగాణ-బెజ్జూర్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని ఇన్‌చార్జి ఎంఈఓ సునీత అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పనిచేసి బదిలీ ఉపాధ్యాయులకు శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు బదిలీలు సహజమని, పనిచేసిన చోట గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. పని చేసిన పలువురు ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కట్ల పాము

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని కన్నెపెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కట్ల పాము కనిపించటంలో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు రాక ముందే విద్యార్థులకు కనిపించడంతో పిల్లలు భయపడి పరుగులు తీసి తల్లిదండ్రులకు చెప్పారు. తల్లిదండ్రులు వచ్చి పామును బయటకు పంపించారు. దీంతో ప్రమాదం తప్పింది.

శ్రావణపల్లిలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం

నవ తెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని వెన్నెల మండలం శ్రవనపల్లి గ్రామంలో శనివారం 25 మంది ఫోర్స్‌తో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. పోలీస్ డాగ్ ద్వారా గంజాయి సాగు రవాణాను అరికట్టెందుకు అనుమానం ఉన్న వ్యక్తుల ఇండ్లను తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు లేని వాహనాలకు ఫైన్ వేశారు. 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు. 150 లీటర్ల గుడుంబా తయారు చేసే బెల్లం పాకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి రూరల్ సీఐ అబ్జాలుద్దీన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎవరు కూడా గాంజాయి సాగు రవాణా సేవించడం నేరమని తెలిపారు. యువత గాంజాయి బారిన పడి వారి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. అనుమానిత వ్యక్తులు సంచరించిన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నెన్నెల ఎస్ఐ ప్రసాద్, తాళ్ల గురజాల ఎస్ఐ రమేష్ బెల్లంపల్లి టు టౌన్ ఎస్ఐ మహేందర్ పాల్గొన్నారు.

ఫైనల్ ఓటర్ జాబితా ప్రదర్శన

నవతెలంగాణ-కాసిపేట

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీల వారీగా ఫైనల్ ఓటర్ జాబితాను అధికారులు ప్రదర్శించారు. 2024కు సంబంధించి 2వ సాధారణ ఎన్నికల ఫైనల్ ఓటర్ల జాబితాను నోటీస్ బోర్డ్‌పై ప్రదర్శనకు పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, సూపరింటెండెంట్ అల్లూరి లక్ష్మయ్య సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీ నారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి పాల్గొన్నారు.

రేబీస్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

వీధి కుక్కల కారణంగా వ్యాప్తి చెందే రేబిస్ వ్యాధి పట్ల ప్రజలందరికి అవగాహన ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం అంతర్జాతీయ రేబిస్ వ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెంపుడు జంతువులకు సమయానుసారంగా తప్పనిసరిగా రేబిస్ వ్యాక్సినేషన్ చేయించాలని, కుక్క కరిచినప్పుడు వెంటనే రేబిస్ వ్యాక్సినేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని, ఆలస్యం చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో రోజుకు 40 నుండి 50 వీధి కుక్కల వరకు సర్జరీ చేయడం జరుగుతుందని తెలిపారు. తద్వారా పునరుత్పత్తిని నియంత్రించవచ్చని, వీధి కుక్కల విషయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లోని వీధి కుక్కల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసినట్లయితే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పెంపుడు జంతువులకు ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకాలను వేయించడం జరిగిందని, పెంపుడు జంతువుల యజమానులు వారి కుక్కలు, పిల్లుల వివరాలు మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ కార్యాలయంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ప్రతి సంవత్సరం సకాలంలో వ్యాధి నివారణ టీకాలు వేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పశు వైద్యాధికారి రేబిస్ వ్యాధి దినోత్సవం ప్రాముఖ్యత, వ్యాధి నివారణ మార్గాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మంచిర్యాల పశు వైద్యాధికారి డా.శంకర లింగం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, పెంపుడు జంతువుల యజమానులు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకోసం ఎల్‌ఓసీ అందజేత



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కొత్త మామిడిపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి లింగన్న గతవారం అనారోగ్యానికి గురికాగా వైద్యం చేయించుకునే స్థోమత లేకపోవడంతో స్థానిక నాయకుడు గడ్డం త్రిమూర్తి చొరవతో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్యం ఖర్చులకు రూ.2.50 లక్షల ఎల్‌ఓసిని రోగి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం త్రిమూర్తి మాట్లాడుతూ తమ నాయకుడు పేదల సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్నారని ఇదే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ అండగా నిలుస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా రోగి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుని మృతికి కారకుడైన ఆర్ఎంపీ అరెస్ట్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

యువకుని మృతికి కారకుడైన ఆర్ఎంపీ అరెస్ట్ చేసినట్లు లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ తెలిపారు. మండలంలోని కొత్త కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బత్తుల మధుకర్ మృతికి కారకుడైన బొడ్డు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సలహా కోరితే అతని వైద్య వృత్తిలో అనుభవం లేకున్నా మూడు ఇంజక్షన్‌లు, రెండు గ్లూకోస్‌లో కలిపి పెట్టి ఒక ఇంజెక్షన్ తొడకి వేసి మృతికి కారకుడయ్యాడని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఎస్ఐ పి సతీష్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో కేసుల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించేల కృషి చేస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి టి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించారు. రాజీమార్గం ద్వారా పలు కేసులను పరిష్కరించి రాజీ పత్రాలను కక్షిదారులకు అందించారు. అనంతరం కక్షిదారులు అనుభావలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు మాట్లాడుతూ నేరం పర్యవసానం తెలిస్తే నేరాలు తక్కువ అవుతాయన్నారు. దాని కోసం డీఎల్ఎస్ఏ ద్వారా చట్టాలు, శిక్షణలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కోర్టుల చుట్టు తిరుగు సమాయాన్ని వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేల ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ ఆదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రిమినల్, సివిల్, ఇన్సూరెన్స్, భార్యభర్తల తగదాలు, సైబర్ క్రైమ్‌లను పరిష్కరించేల అందరి సహకారం తీసుకున్నామన్నారు. అదేవిధంగా సైబర్ ద్వారా మోసపోయిన బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చి మోసపోయిన డబ్బును తిరిగి అందించినట్లు పేర్కొన్నారు. కక్షిదారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, ప్రమీల జైన్, మంజుల సూర్యవార్, దుర్గారాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, ఎస్పీ గౌస్ ఆలం, బార్ అసొసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ పాల్గొన్నారు.

యువతపై ప్రస్తుత రాజకీయాల ప్రభావం : సీఐటీయూ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



యువతపై ప్రస్తుత రాజకీయాలు ప్రభావం చూపుతున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రాజేందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలు యువతపై ప్రభావం, భారత స్వాతంత్ర ఉద్యమంలో యువత పాత్రపై జిల్లా సెమినార్ డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టీకానంద్ అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మతోన్మాదం రాజ్యమేలుతుందని, దానికి యువత ప్రలోభం కాకూడదని, దేశంలో విద్యార్థి యువజన సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలో విద్యా వ్యవస్థ గాడి తప్పిపోతుందని, విద్య రంగంపై పోరాడాలంటే భగత్ సింగ్‌ను ఆదర్శం తీసుకోవాలన్నారు. అనంతరం భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, చపిడి శ్రావణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చట్టారి భీంరావ్, టీవైఎఫ్ఐ జిల్లా నాయకులు రాజు, చిట్టి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో చెన్నూర్ అభివృద్ధి శూన్యం

నవతెలంగాణ-జైపూర్

బీఆర్ఎస్ పాలనలో చెన్నూర్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం, కల్యాణలక్ష్మి ప్రతాలతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. జైపూర్, భీమారం మండలాలను సంధర్శించిన ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. జనవరి నుంచి అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేయనున్నామని, ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసి తీరుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

టన్నెల్‌ను సందర్శించిన జీఎం

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-1ఏ టన్నెల్‌ను జీఎం జి దేవేందర్ శనివారం సందర్శించారు. ముందుగా గని కార్యాలయంలో వివిధ మ్యాప్‌లు ప్లాన్లను పరిశీలించారు. రోజు వారిగా సాధిస్తున్న ఉత్పత్తి లక్ష్యాలను పెంచాలని, ఎల్లప్పుడూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని జీఎం అధికారులకు సూచించారు. అనంతరం కాసిపేట-1ఏ టన్నెల్ పరిసరాల్లో జీఎం దేవేందర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ భూ శంకరయ్య, గ్రూప్ ఇంజనీర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం చౌరస్తాలోని బస్టాప్ వద్ద హెచ్ఐవీ ఎయిడ్స్‌పై కళాజాత ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో న్యాకో సహకారంతో కళాజాత నిర్వహించారు. ఈ సంధర్భంగా హెచ్ఐవీ ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత నిర్వహించి అవగాహన కల్పించారు. హెచ్ఐవీ నాలుగు రకాలుగా సోకుతుందని, మొదటిది ఆరక్షిత లైంగిక సంబంధమని, రెండోది కలుషితమైన సూదులు సిరంజీలు, మూడోది రక్త మార్పిడి, నాలుగోది తల్లి నుండి పుట్టపోయే బిడ్డకు వస్తుందని కళాకారులు ఆట పాట ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జన జాగృతి కళాజాత బృందం సభ్యులు విజయ్, అశోక్, గణేష్, రాజు, బిందు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల దళఅధ్యక్షుడు రత్నం ప్రదీప్ శనివారం లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఎలాంటి కష్టం రాకూడదని, కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను ఆదుకుంటుందన్నారు. ఎమ్మెల్యే వినోద్ చొరవతో నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలాన్ని అన్ని రకాలుగా అభివద్ధి పథంలో ముందంజలో ఉంచుతాడన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు మైదం రమేష్, దారవేణి రాజయ్య, రాజమౌళి, సామ రాజారెడ్డి, సిలార్‌ఖాన్, పానగంటి అశోక్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కుబీర్

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను శనివారం మండల ప్రత్యేక అధికారి శంకర్ ఎంపీడీఓ నవనీత్ కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనికి చేశారు. తరగతి గదులను స్టోర్ రూమును వంటగదిని మరుగుదొడ్లు మూత్రశాలలను పరిశీలించారు. దింతో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం నాణ్యమైన విద్యను అందించాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. తనిఖీ సమయంలో ఎంపీడీ నవనీత్ కుమార్, ఎంపీఓ మోహన్ సింగ్ ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లోగల కేజీబీవీ, జూనియర్ కళాశాలను శనివారం తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాల, టాయిలెట్స్ తోపాటు బియ్యం, కూరగాయలు, ఇతర వంట సరుకుల నాణ్యత పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారికున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించి అధ్యాపకుల కొరత ఉందన్న విషయాన్ని విద్యార్థినులు మహిళా కమీషన్ చైర్ పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాకుండా కొన్ని రకాల సమస్యలు ఎదుర్కొంటున్నట్లు విద్యార్థినులకు వివరించారు. విద్యార్థుల విన్నపాలకు సానుకూలంగా స్పందించిన చైర్‌పర్సన్ తక్షణమే సమస్యలు పరిష్కరించాల్సిందిగా డీఈఓను ఆదేశించారు. మహిళలకు కమీషన్ ఏవిధంగా అండగా ఉంటుందో విద్యార్థినులకు వివరించారు. మహిళల సమస్యలపై మహిళా కమీషన్‌కు ఫిర్యాదు చేయాల్సిన నెంబర్లను క్లాస్ బోర్డ్‌పై రాసి మహిళలందరికి తెలియజేయాల్సిందిగా విద్యార్థులకు సూచించారు.

విద్యార్థినికి ఉచిత వైద్య సాయం

జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్ కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని అస్వస్థతతో బాధపడటం చూసి చలించిపోయిన చైర్ పర్సన్ నేరెళ్ళ శారద స్థానిక నిర్మల్ న్యూరో ఆస్పత్రి వైద్యులు నరసింహారెడ్డి విద్యార్థినికి వైద్యం సాయం అందించాల్సిందిగా కోరారు. ఆ విద్యార్థినికి వైద్యం పర్యవేక్షణ చూడాల్సిందిగా డీఈఓ సంబంధిత ప్రధానోపాధ్యాయురాలిని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

